క్లుప్తంగా

ఏఐటీతో వీజేఐఎం అవగాహన ఒప్పందం

నిజాంపేట్: థాయ్‌లాండ్‌కు చెందిన ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏఐటీ) విద్యాసంస్థతో బాచుపల్లికి చెందిన విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (వీజేఐఎం) కళాశాల పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం కళాశాలలో జరిగే కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ సుబ్బారావు మాట్లాడుతూ ఎంఓయుతో విద్యార్థులు, బోధనా సిబ్బందికి ఎంతో ఉపయోగపడనుందని, నూతన బోధనా పద్ధతులతో పాటు మెలకువలు నేర్చుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. థాయ్‌లాండ్ కళాశాలకు చెందిన విద్యార్థులు వీజేఐఎం కు వచ్చి ఇక్కడి బోధనా పద్ధతులు తెలుసుకునే అస్కారం ఏర్పడుతుందన్నారు. వీజేఐఎంకు చెందిన 25 మంది విద్యార్థులు, ఇద్దరు అధ్యాపకులు ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ట్రైనింగ్ పోగ్రామ్‌లో ఉన్నారని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్ సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం చింతల్ డివిజన్ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో రాందేవ్‌రావు హాస్పటల్‌కు చెందిన హెచ్ఆర్‌సీ సెంటర్ నిర్వాహకులు ఉచిత ఐక్యాంప్‌ను నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగే క్యాంప్‌లో కంటి సమస్యలతో బాధ పడుతున్న వారికి పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని సురేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, శ్రీనివాస్, లక్ష్మి, అప్తమాలజిస్ట్ శ్రీనివాస్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా.?

సుభాష్‌నగర్: రోడ్డు బాగులేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటూ శ్రీరామ్ నగర్ వాసులు రోడ్డెక్కారు. దుండిగల్ మున్సిపల్ గండి మైసమ్మ నుంచి బాదురుపల్లి వెళ్లే నర్సాపూర్ రాష్ట్ర రహదారి శ్రీరామ్ నగర్ వద్ద గుంతలమయంతో ప్రమాదకరంగా మారింది. దీంతో సోమవారం ఉదయం ప్రధాన రహదారిపై బైఠాయించి అధికారుల తీరుపై నిరసనకు దిగారు. దీంతో రోడ్కు ఇరువైపులా ఇక్కడ వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించి, సంబంధిత అధికారుల దష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో శాంతించారు.

అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలి

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో బూత్‌స్థాయి కమిటీల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. అదే విధంగా అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే అన్ని కార్యక్రమాలు, ప్రచార సమావేశాలు వంటివి సోషల్ మీడియాలో వెంటనే అప్లోడ్ చేసేలా ప్రతి ఒక్కరూ అలర్ట్‌గా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు శాయశక్తులా కృషి చేయాలన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



గండిమైసమ్మ- బహదూర్‌పల్లి ప్రధాన రోడ్డుపై బైఠాయించిన శ్రీరామ్‌నగర్‌వాసులు

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అందుబాటులోకి తేవాలని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ లైన్ పూర్తయితే ఎన్నో ఏళ్లుగా నెలకొన్న మురుగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. బీజేపీ నాయకులు నార్లకంటి నర్సింహ, నార్లకంటి ప్రతాప్, శేఖర్, నందుగౌడ్, సందీప్ గౌడ్, మహేష్ గౌడ్, మహేష్, శివ తదితరులు ఉన్నారు.

మోగిన ఎన్నికల నగారా

- పోటీలో నాలుగు ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ఇప్పటికే తమ అభ్యర్థిని ప్రకటించిన బీఆర్ఎస్
- బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లను ప్రకటించని అధిష్టానాలు
- టీటీడీపీ నుంచి బరిలో దిగుతానంటున్న కాసాని జ్ఞానేశ్వర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొదలైన ఎన్నికల వేడి

నిజాంపేట్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల వేడి మొదలైంది. ఇక్కడి నుంచి ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఇప్పటికే పార్టీ అధిష్టానం టిక్కెట్ ప్రకటిండంతో వివేకానంద్ గత నెల రోజుల నుంచే ప్రజల్లో తిరుగుతూ నియోజకవర్గంలో సుడిగాలి పర్యాటనలు చేస్తున్నారు.

◆ బీజేపీ నుంచి కూన శ్రీశైలంగౌడ్ పేరు దాదాపు ఖారారు అని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి కొలను హన్మంత్‌రెడ్డి, భూపతి రెడ్డిలు పోటీ పడుతున్నారు. ఇక తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ సైతం కుత్బుల్లాపూర్ నుంచే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండటంతో ఇక్కడ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నాలుగు ప్రధాన పార్టీల అభ్యర్థులు రంగంలో ఉండటంతో ఇక్కడ చతుర్ముఖ పోటీ నెలకొని ఉంది.

గత ఎన్నికల్లో వీరిద్దరి మధ్యే పోటీ..

◆ 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న కేపీ వివేకానంద్‌కు 1,54,500 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీగా పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్‌కు 1,13,000 ఓట్లు లభించాయి. ఇక బీజేపీ నుంచి బరిలో నిలిచిన కాసాని వీరేశ్‌కు 9,833 ఓట్లు వచ్చాయి. నాడు ప్రధానంగా ఈ మూడు పార్టీల మధ్యలోనే పోటీ జరిగింది.

ప్రజలు ఎవరికి పట్టం కడతారో.?

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రస్తుతం 6,69,253 ఓట్లు ఉన్నాయి. 582 పోలింగ్ స్టేషన్లల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా ప్రస్తుతం నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఎవరికి పట్టం కడతారనే చర్చ విస్తృతంగా జరుగుతోంది.

◆ అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ విశ్వాసంతో ఉన్నారు. అయినా ఎక్కడ నిర్లక్ష్యంగా ఉండకుండా అను నిత్యం ప్రజల్లో ఉండేందుకు కృషి చేస్తున్నారు.

◆ ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతు తనకు లభిస్తుందని.. ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు తనకు లభిస్తాయని కూన శ్రీశైలంగౌడ్ నమ్ముతున్నారు.

◆ ఇక రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని తమ గెలుపు తథ్యామని కాంగ్రెస్‌లో టిక్కెట్టు కోసం పోటీ పడుతున్న కొలను హన్మంత్‌రెడ్డి, భూపతి రెడ్డిలు భావిస్తున్నారు.

◆ కుత్బుల్లాపూర్‌లో టీడీపీ ఓటు బ్యాంకుతో ముదిరాజ్ సామాజిక వర్గంతో విజయం సాధిస్తామని కాసాని జ్ఞానేశ్వర్ ధీమాలో ఉన్నారు. ఇక బహుజన సమాజ్ పార్టీ సైతం కుత్బుల్లాపూర్‌లో పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.ఇలాంటి పరిస్థితిలో ఇక్కడి ప్రజలు ఎవరికి పట్టం కడతారు. ప్రజల విశ్వాసం ఎవరు చూరగొంటారనేది మాత్రం అంతు చిక్కడం లేదు.

ఆంధ్రాప్రాంత ఓటు ఎటు వైపో.?

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆంధ్రాప్రాంత పెద్ద సంఖ్యలో ఉన్నారు. అయితే ఇక్కడ గత ఎన్నికల్లో ఆంధ్రాప్రాంత టీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్‌కు మద్దతుగా నిలవడంతో నాడు భారీ విజయం సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ ఎన్నికల్లో ఆంధ్రాప్రాంత ఏ పార్టీకి అనుకూలంగా ఉన్నారు. ఎవరికి ఓట్లు వేస్తారో అనే విషయంపై నియోజకవర్గంలో జోరుగా చర్చ జరుగుతోంది. ఏది ఏమైన ఓటరు నాడిని ఇప్పుడే చెప్పలేమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

1,53,164 పెరిగిన ఓటర్లు..
అభ్యర్థుల్లో టెన్షన్!



నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడంతో ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 5,16,089 మంది ఓటర్లు ఉండగా 2023 నవంబర్ 30న జరిగే ఎన్నికలకు ఏకంగా 6,69,253 ఓటర్లు ఉన్నారని అధికారులు ప్రకటించడంతో అదనంగా 1,53,164 ఓటర్లు పెరిగారు. పోటీ చేస్తున్న నాయకులు నియోజకవర్గం కలియతిరిగిన ఈ రెండు నెలల్లో ఇంతమంది ఓటర్లను కలుస్తారా లేరా అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తమ మేనిఫెస్టో ద్వారా ప్రజలను ఆకట్టుకునే పనిలో పడ్డారు.

అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గం కుత్బుల్లాపూర్..

రాష్ట్రంలోనే అత్యధికంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అటు కేంద్ర ఎన్నికల సంఘం ఇటు రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి ప్రత్యేకంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో పగడ్బందీగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా ఆయా విభాగాల వారీగా కమిటీలను వేసే పనిలో పడ్డారు.

పోలింగ్ శాతంపై పెంపు అధికారుల కసరత్తు...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో 6,69,253 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. అందులో 3,51,307 పురుష ఓటర్లు, 3,17,793 మంది ఓటర్లు స్త్రీలు, 153 ట్రాన్స్‌జెండర్స్ ఉన్నట్లు అధికారులు ఇటీవల తుది జాబితా విడుదల చేశారు. మొత్తం నియోజకవర్గంలో 582 పోలింగ్ కేంద్రాలను గుర్తించిన ఎన్నికల అధికారి పులి సైదులు ఈ దఫా జరిగే ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచే దిశగా, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లను చేశారు. ఓటర్లకు దగ్గర్లోనే పోలింగ్ కేంద్రాలను ఉండేలా చర్యలు తీసుకున్నారు.

షెడ్యూల్ రావడంతో ప్రచారంలో వేగం పెంచిన నేతలు

ప్రధాన పార్టీల అభ్యర్థులు చాపకింద నీరులా ప్రచారాన్ని విస్తృతం చేసి తాజాగా ఎన్నికల షెడ్యూల్ రావడంతో వేగం పెంచారు. సోమవారం మధ్యాహ్నం 12గంటలకు షెడ్యూల్ వస్తుందని తెలిసిన ఎమ్మెల్యే వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేసి 12 గంటల లోపే పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడం విశేషం.

యువహో.. జయహో..

- గెలుపు, ఓటములను ప్రభావితం చేసేది వీరే..
- 18 నుంచి 39 ఏళ్ల వయస్సు ఉన్న ఓటర్లు 12.90లక్షలు
- మేడ్చల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 26.91లక్షలు

సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యువ ఓటర్లు 47.96 శాతం ఉన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేసే సత్తా వీరి చేతిలోనే ఉంది. దాదాపు సగం ఓటర్లు వీరే ఉండటంతో రానున్న అన్ని ఎన్నికల్లో యువతే నేతల రాత రాయనున్నారు. జిల్లా పరిధిలో మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 26,91,167 మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా కుత్బుల్లాపూర్‌లో 6,69,253 మంది ఓటర్లు ఉన్నారు. కూకట్‌పల్లిలో తక్కువగా 4,47,523 మంది, ఓటర్లు ఉండగా, మేడ్చల్‌లో 5,95,382 మంది, మల్కాజిగిరిలో 4,68,822 మంది ఉప్పల్ నియోజకవర్గంలో 5,10,167 మంది ఓటర్లు ఉన్నారు. మేడ్చల్ జిల్లాలో పురుష ఓటర్లు 13,95,083 మంది ఉండగా, మహిళా ఓటర్లు 12,95,773 మంది ఉన్నారు.

వయస్సు వారీగా ఓటర్లు ఇలా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 18-19 ఏళ్ల వయస్సు ఉన్న ఓటర్లు 41,715 మంది ఉండగా, 20-29 ఏళ్లున్న ఓటర్లు 4,43,403 మంది ఉన్నారు. 30-39 ఏళ్ల ఓటర్లు 8,05,680 మంది, 40-49 ఏళ్లు ఉన్న ఓటర్లు 6,45,334 మంది, 50-59 ఏళ్ల ఓటర్లు 3,89,579 మంది ఉన్నారు. 60-69 ఏళ్లు ఉన్న ఓటర్లు 2,22,554 మంది ఉండగా, 70-79 ఏళ్ల ఓటర్లు 1,10,022 మంది ఉన్నారు. జిల్లాలో 80 ఏళ్లు పైబడిన ఓటర్లు 32,880 మంది ఉన్నారు.

ఓటరు నమోదుపై ప్రచారం..

కొత్త ఓటర్లను నమోదు చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేసింది. బస్తీలు, పట్టణాలు, గ్రామాలలో ఓటరు నమోదు ప్రచార కార్యక్రమం చేసింది. ముఖ్యంగా విద్యాసంస్థల్లో ప్రచార హోరును పెంచింది. 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చు. చాలా ప్రాంతాల్లో యువతి, యువకులు పూర్తిస్థాయిలో ఓటుహక్కుపై దృష్టి సారించేలా చేసిన కృషి ఫలించింది. కొన్నిచోట్ల రాజకీయ పార్టీల నేతలు దగ్గరుండి కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో ఈసారి కొత్త ఓటర్లు 1,01,022 మంది పెరిగారు.

నూతన ఓటర్లు 1.01 లక్షలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవడానికి కొత్త ఓటర్లు సిద్ధమవుతున్నారు. ఈసారి 1,01,022 మంది నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 29,705 మంది కొత్త ఓటర్లుండగా, తక్కువగా ఉప్పల్ నియోజకవర్గంలో 11,310 మంది ఉన్నారు. ఎన్నికల సమయం కావడంతో రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు కొత్త ఓటర్లపై ఎక్కువగా దృష్టి సారించారు.

ఆధార్.. క్యూ



ప్రస్తుత కాలంలో ప్రభుత్వ పథకాలు పొందాలన్నా... ఇతర పనుల నిమిత్తం తప్పనిసరిగా ఆధార్ అవసరం. ఆధార్ లేనిది ఏ పని కాదు. ఇటీవల ప్రభుత్వం ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్, చిరునామా మార్చడం, తప్పులు సరిదిద్దడం అవకాశం ఇవ్వడంతో చాలామంది ఈ సేవ వద్ద క్యూ కడుతున్నారు. సుచిత్ర చౌరస్తాలో సోమవారం ఉదయం 8.30 గంటలకు ఈ సేవ కేంద్రం తెరవక ముందే ఇలా పదుల సంఖ్యలో క్యూకట్టారు.

– సుభాష్‌నగర్

భగవద్గీత చదవకపోతే మన ఐడెంటిటిని కోల్పోతాం

- బ్రాహ్మణ చైతన్య సదస్సులో మాజీ డీజీపీ అరవిందరావు

నిజాంపేట్: సమాజానికి ఏం కావాలో బోధించేవాడే బ్రాహ్మణుడని, అందుకే మన మూలాలను మర్చిపోకూడదని విశ్రాంత మాజీ డీజీపీ, ఐపీఎస్ అధికారి అరవిందరావు అన్నారు. ఆదివారం ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ ఏవీఆర్ మూర్తి నేతృత్వంలో జరిగిన బ్రాహ్మణ చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భగవద్గీత చదవకపోతే మన ఐడెంటిటిని మనం కోల్పోతామని అన్నారు. భారతీయ సంస్కృతి సనాతన ధర్మం మతానికి వ్యతిరేకమని కొందరు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం డెంగీ లాంటిదని ప్రచారం కొనసాగిస్తున్నారని.. మన సంస్కృతిపై దాడులు జరుగుతున్నాయని అలా దాడులు జరగకుండా యాక్టీవ్‌గా ఉండాలన్నారు.

◆ తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు మాట్లాడుతూ... జ్ఞానం లేని వ్యక్తి సమాజంలో గౌరవం పొందడన్నారు. ఆత్మ అనుసంధానం చేసుకునే వాడే బ్రాహ్మణుడిగా పిలవబడతాడని అన్నారు. లోకహితం కోసం పనిచేస్తూ నేటి సమాజంలో మనం గౌరవించబడాలన్నారు.

◆ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ.. కులంతో కాదు గుణంతో బ్రాహ్మణుడు కావాలని చెప్పాల్సిన విషయం ముక్కుసూటిగా చెప్పాలన్నారు. నల్లగొండ లాంటి నగరంలో కట్ట రామచంద్రారెడ్డి లాంటి గురువుల వద్ద విద్యను అభ్యసించామని పేర్కొన్నారు.

◆ హాస్య అవధాని డాక్టర్ శంకర్ నారాయణ మాట్లాడుతూ.. అక్షయపాత్ర నుంచి బ్రాహ్మణుడు భిక్ష పాత్రకు చేరుకున్నాడని బుద్ధిమంతులు బుద్ధిమంతులు కావద్దని పిలుపునిచ్చారు.

◆ ఈ సందర్భంగా డాక్టర్ శ్వేతా బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో వేద భారతి సీఈవో రేమెళ్ళ అవధానులు, శాంతి భారతి పురస్కార గ్రహీత మురుకుంట్ల రాజేశ్వర శర్మ, హరహర రుద్రవీణ సంపాదకులు బాలసుబ్రమణ్యం, ఎంబీఎస్ న్యూస్ ఛానల్ అధినేత డాక్టర్ అవధానుల ప్రసాద్, క్వాలిటీ కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్, బ్రాహ్మణ సంఘాల నాయకులు బడంగ్ పేట నుంచి మంగు రాఘవరావు, సంగారెడ్డి తాలూకా సంఘం ప్రధాన కార్యదర్శి, సురేష్ కుమార్ జోషి, సత్యమూర్తి, బీఏ చారి తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ చైతన్య సదస్సులో మాట్లాడుతున్న పలువురు వక్తలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రంగారెడ్డినగర్ డివిజన్‌లో పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ విజయ

రంగారెడ్డినగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులే మరోసారి అధికారాన్ని తెచ్చిపెడతాయని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీనగర్‌లో రూ. 62 లక్షలతో, ఆదర్శ్‌నగర్‌లో రూ.72 లక్షలతో, సుమిత్రనగర్‌లో రూ.42 లక్షలతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తూ ముందుకు సాగుతున్నామని విజయశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, బస్తీల సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నిజాంపేట్: ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై బాచుపల్లి మండలి రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం నిజాంపేట్ సర్వే నెంబరు 334, 105, రాజీవ్‌గాంధీనగర్‌లలో వెలిసిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేతలు చేపట్టారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా కిట్లు అందజేస్తాం



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

దుండిగల్: పేద విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తుంటే దీనిని కొందరు రాజకీయం చేస్తున్నారని కూన కృష్ణగౌడ్, మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని ప్రభుత్వ విద్యార్థులకు సోమవారం ఉచితంగా నోటు పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... పేద విద్యార్థులను ఆదుకునే దిశగా పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు చేపడుతుంటే అధికార పార్టీ నేతలు ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి కార్యక్రమాలను అడ్డుకోవాలని ఆదేశిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా విద్యార్థులందరికీ కిట్లను అందజేస్తామన్నారు. తొమ్మిది ఏళ్లలో ఎమ్మెల్యే వివేకానంద్ ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేశాడన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ చేసిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో పెండ్లిమడుగుల శ్రీనివాస్‌గౌడ్, గణేశ్, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, విజయ్, సాయి కృష్ణ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం



కొంపల్లిలో రిజర్వాయర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వివేకానంద్, చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

◆ కొంపల్లి మున్సిపాలిటీ అపర్ణ ఫామ్‌గ్రూవ్ కాలనీలో రూ.20 లక్షల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌ను చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం కుమార్, డీజీఎం త్రినాథ్ రావు, మేనేజర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ సుభాష్ నగర్ డివిజన్ వెంకటసాయి అవెన్యూలో రూ. 9.5 లక్షలతో, వేంకటాద్రి నగర్‌లో రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, జీడిమెట్ల డివిజన్ మీనాక్షి ఎస్టేట్‌లో రూ. 70 లక్షలతో ఇండోర్ స్టేడియం, జైరామ్‌నగర్‌లో రూ.96 లక్షలు, వినాయకనగర్‌లో రూ.35లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకు, గాజులరామారం ఆర్‌కే లేఅవుట్‌లో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు.

ఎమ్మెల్యే తరువాత కార్పొరేటర్ శంకుస్థాపనలు..

◆ జీడిమెట్ల డివిజన్‌లో ఎమ్మెల్యే వివేకానంద్ శంకుస్థాపనలు చేసిన తదనంతరం స్థానిక కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి అభివృద్ధి పనులకు తిరిగి శంకుస్థాపన చేయడం స్థానికంగా చర్చానీయాంశమైంది.

మాకు ఇల్లు వచ్చిందా లేదా?



సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన దరఖాస్తుదారులు

కుత్బుల్లాపూర్: నాలుగు విడతలుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయించినా తమకు ఇల్లు రాలేదని పలువురు మహిళలు సర్కిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 14 వేలకు పైగా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇప్పటికే నాలుగు దఫాలుగా ఇల్లు అందజేశారు. కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిల్ల పరిధిలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రానివారు సర్కిల్ కార్యాలయాలకు చుట్టూ తిరుగుతూ తమ పేరు ఉందో లేదో చూడండి అంటూ వేడుకుంటున్నారు.

◆ అప్పట్లో ఇచ్చిన ఆధార్ కార్డులో ఫోన్ నెంబర్లు చేంజ్ అయ్యాయని.. తాము అప్లికేషన్ పెట్టిన అడ్రస్‌లో లేమని.. ఇల్లు ఉన్న వారికే తిరిగి ఇల్లు వచ్చాయని... కార్యాలయాలకు వెళ్తే సమాధానం చెప్పే అధికారి లేడని.. ఇదేమని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని సోమవారం సర్కిల్ కార్యాలయానికి వచ్చిన ప్రజలను సాక్షి పలకరిస్తే ఇలా చెప్పుకొచ్చారు... ఒకవైపు మండల కార్యాలయం మరోవైపు సర్కిల్ కార్యాలయాలు చుట్టూ ప్రజలు తిరుగుతున్న వారికి సరైన సమాధానం చెప్పకుండా కొంతమంది అధికారులు కిందిస్థాయి సిబ్బంది వారితో ఆటలు ఆడుకుంటున్నారు.. సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కార్యాలయం చుట్టూ ఇటు సర్కిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తమ జేబులు గుల్ల చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించని వారికి క్లారిటీ ఇవ్వాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

నాకు ముగ్గురు ఆడపిల్లలు..



2016 లో డబల్ బెడ్ రూమ్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటివరకు ఎంక్వయిరీ కి రాలేదు.. అసలు నాకు వచ్చిందా లేదా అన్న విషయాన్ని తెలుసుకునేందుకు వస్తే ఎవరు సమాధానం చెప్పడం లేదు. బయటకు వెళ్ళిపో అంటూ బెదిరిస్తున్నారు. మేము ఎవరికీ చెప్పుకోవాలి మా బాధలు. ఇల్లు ఉన్న వారికే డబల్ బెడ్ రూమ్ లో వచ్చాయి. .మాకు న్యాయం చేయండి.

– లక్ష్మీబాయ్, సూరారం

ఎంక్వైరీ పూర్తి చేశారు.



డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇంతవరకు మాకు రాలేదు. వచ్చిన వాళ్లకే వస్తున్నాయి. ముగ్గురు పిల్లలతో బతుకు వెళ్ళదీస్తున్న నాకు ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలి. లేదంటే ఎన్నికల ప్రచారానికి వచ్చే బీఆర్ఎస్ నాయకులను నిలదీస్తాం.

– సత్యవతి, సూరారం కాలనీ

పింఛన్ కోసం తిరుగుతున్నాను..



భార్య , కొడుకు చనిపోయారు. ఒక్కడినే ఉంటున్నాను. పింఛన్ కోసం నాలుగు సంవత్సరాలుగా దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తూ వస్తున్నాను.. ఇప్పటివరకు ప్రభుత్వం కనికరించలేదు. పూట గడవడమే గగనంగా మారింది. మాలాంటి వారికి పింఛన్ ఇచ్చే విషయంలో అధికారులు ముందుగా వివరిస్తున్నా

– సత్యనారాయణ